# ప్రభుత్వోద్యోగుల కథ

ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేసే వుద్యోగస్థులలో చాలామంది ప్రతిరోజు వుదయం పేపర్ తిరగేసినప్పుడల్లా ఓ ముఖ్యమయిన వార్త కోసం వెదుకుతారు. అది వారికి సంతోషం కలిగించే వార్త. అలా అని "చంద్రునిమీద కాలుపెట్టిన తొలి భారతీయుడు" లాంటి వార్తలేం కాదు. వారు ఎదురుచూసేది, భారతదేశ ప్రజలలో మిగతావారికి నిజానికి అది అంత ప్రాముఖ్యం గల విశేషమేం కాదు.

డి.ఏ. హెచ్చింపు

ఈ చిన్న హెడ్‌లైన్‌కోసం, వెతుకుతుండటం ప్రభుత్వోద్యోగులలో చాలమందికి రివాజు. సోమసుందరం దినపత్రికను తిరగేయడానికి కారణం కేవలం ఆ వార్తకోసమే "ప్రధాని మీద హత్యాప్రయత్నం" లేదా "ఇండియా-పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం నిన్నరాత్రి మొదలయింది" లాంటి వార్తలతనికి ఎంతమాత్రం పట్టవు.

ఆ రోజు ఉదయం సోమసుందరం కాఫీ తాగుతూ. ఎల్.ఐ.సి.లో పనిచేసే పక్కింటి ప్యూన్ తెప్పించే పేపర్‌ని ఎప్పటిలా అరువు తెచ్చుకుని హెడ్‌లైన్ చూడసాగాడు

ఆయన కళ్ళబడిందా హెడ్‌లైన్.

కేంద్ర ప్రభుత్వోద్యోగుల కరువుభత్యం హెచ్చింపు.

ఆ చిన్న పేరాని ఆత్రంగా చదివాడు. ప్రభుత్వోద్యోగులతో కేంద్ర ప్రభుత్వానికున్న వప్పందం ప్రకారం, ధరల పెరుగుదల దృష్ట్యా నాలుగు డి.ఏలను ఇవ్వాలని నిర్ణయించారని, ఆర్డర్సు త్వరలో వివిధకార్యాలయాలకి చేరుతాయని వార్త జీతం తప్ప ఒక్క పైసాకూడా ఇతరత్రా ఆదాయంలేని సోమసుందరం వుత్సాహంగా పెన్ను, కాగితం తీసుకుని తనకి డి.ఏ. మొత్తం ఎంత వస్తుందో లెక్క వేశాడు.

నూట ఎనభై రెండు రూపాయలదాకా వస్తుంది. ఆ సంగతి ఒకటి రెండు రోజులలో కుటుంబ సభ్యులకి చెప్పాడు. రాత్రి భోజనాల దగ్గర డి.ఏ సొమ్మని ఏం చేయాలా అని తన ముగ్గురు కుటుంబ సభ్యులతో చర్చించాడు.

భార్య తనకి ఇంట్లో కట్టుకునే చీరలు రెండు కొనవ్వమని కోరింది. తన కోరికలో న్యాయంవుందని నిరూపించటానికి తను కట్టుకున్న చీర ఎక్కడెక్కడ చిరిగిందో చూపించింది.

"నిజమే నీకు కట్టుడు చీరలు కొంటాను" జాలిపడ్డాడు సోమ సుందరం.

"నాన్నగారు! రామప్పకి ఎస్క్రషన్ తీసుకెళుతున్నారు మావాళ్ళు. డి.ఏ. రాగానే నన్ను పంపరూ?" పద్దెనిమిదేళ్ళ కొడుకు అడిగాడు జాలిగా.

"నీకు చరిత్ర అంటే ఇష్టంకదా? ఆల్‌రైట్! అమ్మకి ఓ చీర, మిగిలింది నీ ప్రయాణానికి" వొప్పుకున్నాడు సోమసుందరం.

"మరి నా మాటేమిటి? డి.ఏలో నాకేం లేదా?" అడిగింది పదిహే నేళ్ళ కూతురు.

"ఏం కావాలి!" అడిగింది తల్లి కూతురిని.

"నాకు ఓణీ కావాలి డేడీ? ఇక ఓణీలు మొదలుపెడతాను"

సోమసుందరానికి కూతురి బాధ అర్థమయింది ఆమె చెప్పిన మాటల కన్న కంఠంలోని భావాలని బట్టి.

"మనం ఆ సంగతి ఆలోచించనేలేదు. అన్నిటికన్నా ముఖ్యం ఓణీలు. అలాగేనమ్మా నీకు ఓణీలుకొని మిగిలితే ఇతరత్రాలుఆలోచిద్దాం" చెప్పాడాయన అరునయంగా.

"థాంక్స్ డేడీ!" సంతోషంతో ఆ అమ్మాయి కళ్ళు విప్పారాయి.

"మీకెప్పుడు చెల్లాయే ఎక్కువ నాన్నగారు. అసలు నన్నెప్పుడు పట్టించుకున్నారు కనక" విసురుగా చెప్పాడు కొడుకు.

"అదికాదురా! నువ్వు రామప్ప మరోసారి వెళితే కొంప మునుగు పోయేదేలేదుగా— ఈసారి డి.ఏ ఎరియర్స్ రాగానే...."

"నాకేం అక్కరలేదు అసలు నేను మీరు పంపినా అప్పుడు వెళ్ళను"

కోపంతో కంచంలో చెయ్యి కడుక్కొని అర్థాకలితో లేచిపోయాడు కొడుకు.

భార్యవంక చూశాడాయన. ఆవిడ కళ్ళలో బాధ తొంగిచూసింది. ఈ చింపిరి చీరలతోనే నా జీవితం గడవాలా అన్నట్లుగా వుంది ఆవిడ చూపు.

ఆయన ఏం మాట్లాడలేకపోయాడు.

"నీకో చీర, దీనికో ఓణీ కొందాం లేవే. నూటఎనభై రెండుతో రెండూ రావూ?" అడిగాడు భార్యని.

నాలుగయిదు రోజులదాకా కొడుకు తండ్రితో ఎడమొహం, పెడ మొహంగానే వున్నాడు. ఆయనకీ బాధగానే వుంది.

తల్లీ కూతుళ్ళు మాత్రం డి.ఏ ఎరియర్స్‌కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.

ఓ రోజు ఉదయం కాఫీ తాగుతూ ఎప్పటిలా అరువు పేపర్‌ని తిర గేస్తుంటే సోమసుందరం కంటపడిందా వార్త.

"ప్రభుత్వం తమ వుద్యోగులకు డి.ఏ ఎరియర్స్ కింద మొత్తం నూటడెభ్భై ఆరుకోట్ల రూపాయలు చెల్లించాల్సివుంది, దేశంలోని ద్రవ్యోల్బణం దృష్ట్యా ఆ మొత్తాన్ని వారి వారి ప్రావిడెంట్ ఫండ్‌లో జమచేస్తాం కాని నగదు రూపంలో చెల్లించటం జరగదు"